సాక్షి
అనకాపల్లి

బుధవారం । 3 । మే । 2023



నిషేధ సమయంలో చేపల వేట

వేట నిషేధాన్ని ఉల్లంఘించి సముద్రంలో చేపల్ని పట్టి, తరలిస్తున్న వ్యాన్‌ను దొండవాక మత్స్యకారులు మంగళవారం పట్టుకున్నారు.

8లో



లక్ష కుంకుమార్చన

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

8లో

వర్ష సూచన

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు వర్ష సూచన ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 3న 8 ఎంఎం, 4న 8 ఎంఎం, 5న 6 ఎంఎం, 6న 1 ఎంఎం, 7న 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు.

న్యూస్‌రీల్

విద్యాశాఖ ఆర్జేడీగా లింగేశ్వర రెడ్డి

విశాఖ విద్య: విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా బి.లింగేశ్వర రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్జేడీగా పనిచేస్తున్న జ్యోతికుమారి సెలవుపై వెళ్లటంతో ఆమె స్థానంలో విజయనగరం డీఈవో లింగేశ్వర రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మన్యం పార్వతీపురం జిల్లా ఐటీడీఏ డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న పి.బ్రహ్మాజీరావును అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదే విధంగా అనకాపల్లి జిల్లా యలమంచిలి డిప్యూటీ డీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎన్.ప్రేమ్‌కుమార్‌ను మన్యం పార్వతీపురం జిల్లా డిప్యూటీ డీఈవోగా బదిలీ చేసి, జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ అధికారి(డీఎస్ఈవో)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటులో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం

అనకాపల్లి టౌన్: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం కల్పించనట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన విద్యార్థులను లాటరీ ద్వారా ఈ నెల 22న ఎంపిక చేసి, జాబితా విడుదల చేస్తామన్నారు. ఆసక్తి గలవారు http://cse.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సమీపంలోని డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ జాతీయ జట్టు నేడు నేపాల్ పయనం

జట్టులో అక్కయ్యపాలెం క్రీడాకారుడు




కోచ్‌తో మణికంఠ

సీతంపేట: నేపాల్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జాతీయ జట్టు విశాఖ నుంచి బుధవారం పయనమవుతుంది. ఫిబ్రవరిలో జైపూర్‌లో జరిగిన అండర్–16 జాతీయస్థాయి పోటీలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక జేసి.. కోచ్‌లు శ్రీనివాస్, మధుసూదన్, లతీఫ్ ఆధ్వర్యంలో విశాఖలోని రైల్వే స్టేడియంలో శిక్షణ ఇచ్చారు. 16 మందితో మంగళవారం జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన పాండవ మణికంఠ ఎంపికవ్వడం విశేషం. కప్ సాధించి తిరిగి రావాలని అతని తండ్రి పాండవ ఈశ్వరరావుతో పాటు స్థానికులు ఆకాంక్షించారు.

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ రాక నేడు

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం విశాఖ వస్తున్నారు. రాత్రి 8 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, రాత్రికి అక్కడే బస చేస్తారు. 4న 10 గంటలకు జర్నలిస్టులతో, 11.30 గంటలకు అధికారులతో సమావేశమవుతారు. రాత్రి 7గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత మూడవ రోజైన మంగళవారం కొనసాగింది. ఈ నెల 5న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల(120 కిలోల) పచ్చి చందనంను సమకూర్చేందుకు ఆదివారం అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు 43, రెండో రోజు 43, మూడో రోజు 30 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో నాలుగు కిలోల చందనం కావాల్సి ఉండగా.. బుధవారం కూడా అరగదీత కొనసాగనుంది.

ఉజ్వలాంధ్ర



- రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- రూ. 21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్
- రూ.2వేల కోట్లతో తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణం
- సీఎం జగన్ చేతుల మీదుగా నేడు శంకుస్థాపన
- విమానాశ్రయం నుంచి విశాఖ వైపు మరింత అభివృద్ధి
- 139.16 ఎకరాల్లో రెసిడెన్షియల్ ఏరియా డెవలప్‌మెంట్

భోగాపురం ఎయిర్‌పోర్టు

విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
రన్‌వే పొడవు	3.8 కి.మీ
తొలి దశ	ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలు
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్రవాసుల కలలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ఇటీవలే శ్రీకాకుళంలో మూలపేట పోర్టు పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బుధవారం మరిన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.4,592 కోట్లతో భోగాపురం వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.21,844 కోట్ల పెట్టుబడులతో మధురవాడ ఐటీ హిల్‌లో అదానీ డేటా సెంటర్, సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారకరామ తీర్థ సాగర్, జెట్టీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఒకవైపు అంతర్జాతీయ విమానాశ్రయం.. మరోవైపు అదానీ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం పోర్టు, జెట్టీ, రైతుల సంక్షేమం కోసం రిజర్వాయర్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర.. ఉజ్వలాంధ్రగా మారనుందని అందరిలో సంతోషం వ్యక్తమవుతోంది.

రెండు వారాల వ్యవధిలోనే..

కొద్ది రోజుల కిందట శ్రీకాకుళం జిల్లాలో రూ.4,362 కోట్ల వ్యయంతో చేపడుతున్న మూలపేట పోర్టు పనులకు సీఎం శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అలాగే రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్టు పనులు, రూ.300 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మరిన్ని భారీ పెట్టుబడులకు పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేస్తుండటం విశేషం. ఈ పెట్టుబడుల ప్రవాహంతో స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారనుంది.

విశాఖ వైపు మరింత అభివృద్ధి

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం అధునాతనంగా రూపుదిద్దుకోనుంది. ఒకేసారి 22 విమానాలను నిలిపి ఉంచేందుకు వీలుగా.. ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణికులు విమానయానానికి అనుగుణంగా రూ.4,592 కోట్ల పెట్టుబడితో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీ కూడా ఏర్పాటు కానుంది. భోగాపురం నుంచి విశాఖ వైపు అభివృద్ధి చేసేందుకు అనుగుణంగా 154.74 ఎకరాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. 139.16 ఎకరాల్లో విశాఖ నగరం వైపునకు రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా భోగాపురం నుంచి విశాఖ నగరం వరకు నివాసిత ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయి. హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాల తరహాలో రానున్న రోజుల్లో విశాఖ–విజయనగరం కలిసి అభివృద్ధి చెందే అవకాశం ఉందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులను ఒప్పించి.. కోర్టుల్లో ఉన్న కేసులన్నీ పరిష్కరించి జీఎంఆర్ సంస్థకు ఆ భూములను అప్పగించారు.

నాడు

2019 ఫిబ్రవరి 14న భోగాపురం విమానాశ్రయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శిలాఫలకం ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాలేదు. శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే.. వంద మందికి పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఈ కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రిగా పని చేసిన అశోక్ గజపతిరాజు ముఖం చాటేశారు.

నేడు

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు త్రిముఖ వ్యూహం అనుసరించారు. భూసేకరణ పూర్తి చేయించారు. రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను తరచూ సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. ఇలా మార్గం సుగమమైన నేపథ్యంలో శంకుస్థాపనకు సర్వం సిద్ధమైంది.

సీఎం జగన్ పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ 9.30 గంటలకు బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలంలోని ఎ.రావివలస చేరుకుంటారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభ అనంతరం 12.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. 2.30 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్–4లో వైజాగ్ టెక్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత ఎంపీ ఎంవీవీ ఇంటికి చేరుకొని నూతన దంపతులైన ఆయన కుమారుడు, కోడలిని ఆశీర్వదిస్తారు. 5.30 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు.

ఇదీ అదానీ డేటా సెంటర్

వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ (వీటీపీఎల్) ఆధ్వర్యంలో రూ. 21,844 కోట్లతో 190.29 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌తో పాటు ఐటీ, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు కానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం ఏడేళ్ల కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్టు కంపెనీ ఒప్పందం చేసుకుంది.



నాడు

తమ ప్రభుత్వ హయాంలోనే అదానీ డేటా సెంటర్ వచ్చిందంటూ టీడీపీ నేతలు వాస్తవాన్ని దాచిపెట్టి గొప్పలకుపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడా భూమి కూడా చూపించకుండానే 2019 జనవరి 9వ తేదీన కాపులుప్పాడ, నక్కపల్లి, జి.చోడవరం ప్రాంతాల్లో మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు టీడీపీ ప్రభుత్వం హడావుడిగా అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదానీ డేట్ సెంటర్‌కు నిర్దిష్టంగా భూమిని కేటాయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఏయే సహాయ సహకారాలను అందిస్తున్న విషయాన్ని కూడా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మధురవాడలోని సర్వే నంబర్ 409లో 130 ఎకరాల్లో అదానీ డేట్ సెంటర్ ఏర్పాటవుతోంది. కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ కోసం 60.29 ఎకరాలను కూడా కేటాయించింది. ఇందుకు అనుగుణంగా 2023 మార్చి 11న ఉత్తర్వులు జారీ చేసింది.

పెట్టుబడులు ఇలా..

మొదటి దశలో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
200 ఎండబ్ల్యూ డేటా సెంటర్	10,288	4,040
ఐటీ, బిజినెస్ పార్క్	2,363	15,110
స్కిల్ సెంటర్	1,171	3,750
మొత్తం	**14,634**	**24,990**

రెండో దశ(కాపులుప్పాడ వద్ద)లో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
100 మెగావాట్ల డేటా సెంటర్	5,070	2,200
ఐటీ, బిజినెస్ పార్క్	1,165	15,350
స్కిల్ సెంటర్	400	1,025
రిక్రియేషన్ సెంటర్	575	1,875
మొత్తం	7,210	20,450

నాలుగు దశల్లో చేపట్టనున్న ఈ నిర్మాణాలను ఏడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని కంపెనీ తెలిపింది.

సాంకేతిక విద్యతో ఉన్నత కొలువులు

- ఉద్యోగ విజయోత్సవంలో డీఎస్పీ ప్రవీణ్‌కుమార్
- 33మంది విద్యార్థులకు నియామక పత్రాలు పంపిణీ



నియామక పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం: సాంకేతిక విద్యతో ఉద్యోగ కొలువులు సాధించవచ్చని డీఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమంలో డీఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతుండగానే ఉద్యోగాలు సాధించడం గొప్ప అదృష్టమన్నారు. సాంకేతిక విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రభుత్వం చదువుకునేందుకు అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. అవకాశాలను అందిపుచ్చుకొని కష్టపడి చదివితే ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధన చేస్తే విజయం తప్పనిసరిగా వరిస్తుందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు మాట్లాడుతూ వీల్స్ ఇండియా లిమిటెడ్, సమీర్, ఎఫ్టీసోనిక్స్, రామ్‌కో, పయనీర్ అల్యూమినియం కంపెనీల్లో 33 మంది విద్యార్థులు నియమితులయ్యారన్నారు. మరో 25 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. 33 మంది విద్యార్థులకు ఆయా కంపెనీలు ఇచ్చిన నియామక పత్రాలను అందజేశామన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి డీఎస్పీ నియామక పత్రాలను అందజేశారు. అన్‌రాక్ కంపెనీ హెచ్ఓడీ ఎల్.ఎస్.రావు, సాంకేతిక విద్య డిప్యూటీ డైరెక్టర్ బి.కళ్యాణం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో విశేష హోమాలు



హోమం జరిపిస్తున్న వేదపండితులు

విశాఖ: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా దేవస్థానం మండపంలో మంగళవారం విశేష హోమాలు చేశారు. ముందుగా ఆరాధన, నివేదన అనంతరం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. బుధవారం వైదిక సదస్యం, వేదపఠనం, శ్రీవారి ఆశీర్వచనం, అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు తెలిపారు.

ఆత్మబంధువుకు అశ్రు నీరాజనం

- మతి స్థిమితం లేని అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు
- చినపాచిల గ్రామస్తుల ఆదర్శం



అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్తులు

రావికమతం : ఓ వృద్ధురాలు...ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు... భాష మనదికాదు...మతి స్థిమితం లేదు....కానీ ఆ గ్రామస్తులకు ఆప్తురాలైంది. గ్రామంలో ఎక్కడ చెత్త ఉన్నా ఎత్తి ఊరు చివర పోస్తూ ఉండేది. ఎవరు ఏం పెట్టినా తినేది తప్ప ఎవరినీ ఏమీ అడిగేది కాదు. చినపాచిల గ్రామంలోని నూకరాజు మాస్టారు ఇంటి ఆవరణలోనే ఆమె నివాసం. వయస్సు 60 పై బడినా చలాకీగా తిరిగేది. ఆమెది మంచి మనసని భావించేవారు. ఆమె ఎదురొస్తే మంచి జరుగుతుందని భావించేవారు. మంచి మామ్మ, పిచ్చిమామ్మ అని పిలుస్తూ గ్రామస్తులు ఆప్యాయత కనబరిచేవారు. నూకరాజు మాస్టారు మాత్రం ఆమెకు పాదాభివందనం చేసేవారు. అతని ఇంటనే ఆశ్రయం ఇచ్చేవారు. అటువంటి ఆప్తురాలు లోకం విడిచి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం కమ్యూనిటీ హాల్లో ఆమె కదలకుండా పడి ఉంది. అనుమానం వచ్చిన ఆ గ్రామస్తులు పరిశీలించగా మృతి చెందినట్టుగా గుర్తించారు. దీంతో ఆ విషయం గ్రామమంతా తెలిసింది. కోఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కొమార ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు జనపాల వెంకట్రావుతో పాటు పలువురు అక్కడకి చేరుకున్నారు. నలుగురినీ పిలిచి తమ ఆత్మ బంధువుగా భావించే ఆమె అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అంతిమ యాత్ర చేసి, దహన క్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొమార ప్రసాద్ మాట్లాడుతూ ఒడిశా నుంచి వచ్చి తెలుగు రాకున్నా 20 ఏళ్లుగా తమ గ్రామంలోనే ఉంటూ గ్రామస్తులకు ఆప్తురాలైందన్నారు. మతి స్థిమితం లేక యాచించుకు తిరిగేదని, ఎవరు ఏంపెట్టినా తిని దీవించేదని తెలిపారు. ఆమె అంతిమ యాత్రకు పెద్ద ఎత్తున గ్రామస్తులు హాజరై కన్నీటితో వీడ్కోలు పలికారు.

ఎఫ్‌పీవో గ్రూపులతో రైతులకు మేలు

- స్థానిక విక్రయాలతో ఆర్థిక ప్రయోజనం
- గొండుపాలెంలో పంట కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్



పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద ఆయిల్ తయారీ విధానం గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కె.కోటపాడు: ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)లో గల రైతులు పండించే పంటలను పట్టణాల్లో గల రైతు బజార్లలో కాకుండా స్థానికంగా ఉండే కలెక్షన్ సెంటర్లలో విక్రయించుకుంటే సమయం ఆదా అవుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. గొండుపాలెం గ్రామంలో కృషి ఫల రైతు ఉత్పత్తిదారుల సంఘంలో గల రైతులు ఉద్యానవనశాఖ సహకారంతో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. కె.కోటపాడు మండలంలోని 19 గ్రామాలకు చెందిన 425 మంది రైతులు ఈ గ్రూపులో సభ్యులుగా ఉంటూ కూరగాయలు, జీడి, మామిడి తదితర పంటలను సాగు చేస్తున్నట్లు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు దేముళ్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు బజార్లలో లభించే మద్దతు ధరే కలెక్షన్ సెంటర్లో కూడా రైతుకు దక్కనుందని చెప్పారు. ఖర్చులు తగ్గుతాయని, సమయం ఆదా అవుతుందని వివరించారు. మామిడికి ఈ ఏడాది అందించిన ఫ్రూట్ కవర్ వలన ఫలితం ఎలా ఉందో రైతులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకరరావును ఆదేశించారు. మామిడి రైతులకు ప్రయోజనం కలిగితే వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో ఫ్రూట్ కవర్లను అందిస్తామన్నారు. ఎఫ్‌పీవోలకు కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి ఉద్యానవనశాఖ ద్వారా 75 శాతం రాయితీపై నిధులను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి, భార్గవ్ ఎఫ్‌పీవో చైర్మన్ లాలం అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్‌లో అంతర పంటలపై అవగాహన

బుచ్చెయ్యపేట: పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులకు సూచించారు. మంగళవారం బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బీపురంలో పామాయిల్ ఫ్యాక్టరీ, పామాయిల్ నర్సరీలు, రైతులు సాగు చేస్తున్న పామాయిల్ తోటలను ఆయన పరిశీలించారు. నర్సరీలో షేడ్‌నెట్ కింద, ఆరు బయట పెంచుతున్న పామాయిల్ మొక్కలను ఆయన పరిశీలించారు. పామాయిల్ ఫ్యాక్టరీలో క్రూడాయిల్ తయారీ, నూనె తయారీ విధానం గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఏడాదికి హెక్టారుకు రూ.5,250ల విలువైన ఎరువులను నాలుగు సంవత్సరాలు ఉచితంగా అందిస్తామన్నారు. పామాయిల్ మొక్కల్లో అంతర పంటల సాగుకు హెక్టారుకు రూ.5 వేలు చొప్పున మూడు సంవత్సరాలు అందిస్తామన్నారు. జిల్లా ఉద్యానశాఖాధికారి ప్రభాకరరావు, డివిజన్ అధికారి గణేష్, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రనాథ్, ఏవో భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీలను సద్వినియోగం చేసుకోవాలి

చోడవరం: వ్యవసాయ ఉత్పత్తుల కోసం ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజీలను రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. అడ్డూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోల్డ్ స్టోరేజ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. సుఫల జాగృతి ఉద్యానపంటల ఉత్పత్తిదారుల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యానవనశాఖ రూ.15 లక్షలతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ భవనం పనులు పూర్తయి త్వరలో ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. అడ్డూరు పరిసరాల్లో ఎక్కువ మంది రైతులు ఉద్యానవన పంటలు పండిస్తుండటంతో ఈ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఇక్కడ నిర్మించామన్నారు. మామిడి, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలన్నీ ఇక్కడ నిల్వ చేసుకోవచ్చునన్నారు.

చంద్రబాబుది పీ - 420 ఫార్ములా

- 'పీ–4' అంటే పంగనామాలు, పచ్చి అబద్ధాలు, పచ్చ పత్రికలు, వెన్నుపోట్లు
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

10లో

కన్నీటి సంద్రం

- రేవుపోలవరం తీరంలో నీట మునిగి బీటెక్ విద్యార్థి మృతి
- పుట్టిన రోజు వేడుక విషాదాంతం




తీరంలో మృతవాత పడిన జగదీష్ మృతదేహం (ఇన్‌సెట్) జగదీష్ (ఫైల్)

ఎస్.రాయవరం/నర్సీపట్నం: సాగర ఘోషను మించిన కేరింతల హోరు ముందు కెరటాలు చిన్నబోయాయి. ఆనందం ఉరకలేయగా యువకులంతా సందడి చేశారు. స్నేహితుడి పుట్టిన రోజు సందర్భంగా ఏడుగురు బీటెక్ విద్యార్థులు సముద్ర తీరంలో కేక్ కట్ చేశారు. అనంతరం ముగ్గురు స్నానానికి దిగారు. వారిలో ఒకరు కెరటాల పాలు కావడంతో ఒక్కసారిగా విషాదం అలముకుంది. తీవ్ర గాలింపు అనంతరం మృతదేహం కూడా లభించడంతో తీరం కన్నీటి సంద్రమే అయ్యింది. రేవుపోలవరంలో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మాకవరపాలెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు తీరం ఒడ్డున మిత్రుడి బర్త్‌డే జరుపుకున్నారు. కేక్ కటింగ్ అనంతరం ముగ్గురు యువకులు స్నానానికి దిగారు. అందులో నర్సీపట్నం మండలం గురందరపాలెం గ్రామానికి చెందిన కొల్లాన జగదీష్ (18) కెరటాల్లో చిక్కాడు. పోలీసులు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో నేవీ హెలికాప్టర్‌తో గాలించారు. కాసేపటికి బంగారమ్మపాలెం, రేవుపోలవరం గ్రామాల మధ్య తీరంలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చినట్టు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. తండ్రి లేకపోవడంతో తల్లి పద్మ టిఫిన్ సెంటర్ నడుపుతూ జగదీష్‌ను, అతని సోదరిని చదివించుకుంటోంది. ఇంజినీరింగ్ చదువుతున్న కొడుకుని చూసుకొని త్వరలో కష్టాలు తీరుతాయని ఆనందపడింది. తన ఆశలు నీటిపాలు కావడంతో ఆమె కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనతో గురందరపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నిషేధ సమయంలో చేపల వేట

- అక్రమ చేపల రవాణాను పట్టుకున్న మత్స్యకారులు

నక్కపల్లి : వేట నిషేధాన్ని ఉల్లంఘించి సముద్రంలో చేపల్ని పట్టి, తరలిస్తున్న వ్యాన్‌ను దొండవాక మత్స్యకారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో ఏప్రిల్ 15 నుంచి చేపల వేటను ప్రభుత్వం నిషేధించింది. ఈ సమయంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు రూ.10 వేలు చొప్పున పరిహారాన్ని కూడా అందిస్తోంది. అయితే ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి కొందరు సముద్రంలో యథావిధిగా వేటసాగిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇతర ప్రాంతాల్లో బోట్లతో వేటసాగించి వలలకు చిక్కిన పెద్ద పెద్ద చేపలను పెదతీనార్ల శివారు దొండవాక తీరంలో కాకినాడకు చెందిన వ్యక్తికి విక్రయించారు. ఈ చేపలు కొనుగోలు చేసిన వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా తన సొంత వ్యాన్‌లోని చేపల్ని ఎక్కిస్తుండగా స్థానిక మత్స్యకారులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని పెంటకోట మెరైన్ పోలీసులకు, స్థానిక సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లారు. చేపల ట్రేలను స్వాధీనం చేసుకున్నారు. మత్స్యశాఖ జేడీకి కూడా విషయాన్ని చేరవేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి వ్యాన్‌కు రూ.20 వేలు అపరాధ రుసుం విధించారు. మొదటి తప్పుగా భావించి వ్యాన్‌ను విడిచిపెడుతున్నట్టు చెప్పారు. పెనాల్టీ సొమ్ము వ్యాన్ యజమాని వద్ద లేకపోవడంతో, వ్యాన్ ఒరిజినల్ రికార్డులు స్వాధీనం చేసుకుని విడిచిపెట్టారు. వేటనిషేధం అమల్లో ఉండగా ఇతర ప్రాంతాలకు చెందినవారు మరబోట్లతో యథావిధిగా వేట సాగిస్తున్నారంటూ స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. మెరైన్ పోలీసులు గస్తీ ముమ్మరం చేసి నిషేధ సమయంలో వేటసాగించే బోట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సముద్రంలో వేటాడిన చేపల్ని దొండవాక తీరానికి చేర్చిన కూలీలు


చేపలు తరలించేందుకు సిద్ధం చేసిన వ్యాన్

జూన్ 6న మోదకొండమ్మ జాతర

- సతకంపట్టు వద్ద కొలువురాట నేడు


అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ జాతర జూన్ 6న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు మంగళవారం తెలిపారు. జాతరలో భాగంగా ఈ నెల 3(బుధవారం)న సతకంపట్టు వద్ద అమ్మవారి కొలువు రాట వేయనున్నట్టు పేర్కొన్నారు. 7న జాతరపై గ్రామంలో చాటింపు వేస్తామని, 9న అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను ఆలయం నుంచి సతకంపట్టు వద్దకు మేళతాళాలతో ఊరేగింపుగా తెచ్చి, కొలువుదీర్చనున్నట్టు వెల్లడించారు. సుమారు నెల రోజులపాటు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. పండగ రోజు సతకంపట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఆలయానికి చేర్చడంతో పండగ ముగుస్తుందని కమిటీ తెలిపింది.

అమ్మవారి ఆలయంలో భక్తుల తాకిడి

మంగళవారం అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. స్థానికంగా వీధి పండగలు జరగడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసి, ఉచితంగా ప్రసాద వితరణ చేసింది.

క్లుప్తంగా

పార్థసారథికి సాహిత్య పురస్కారం


కవిశ్రేష్ఠ పార్థసారథిని అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ సాహిత్య సంబరాల్లో శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్ప్రెసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థి, యువ కవి ఎయ్యుణ్ణి పార్థసారథి అయ్యంగార్‌కి జాతీయ సాహిత్య పురస్కారంతో ఘన సత్కారం జరిగింది. ఉత్తమ కవితను రచించినందుకు పద్మశ్రీ ప్రొఫెసర్ కె.ఇనాక్ చేతుల మీదుగా జాతీయ సాహిత్య పురస్కారంతో పాటు, కవి శ్రేష్ఠ బిరుదు, ప్రశంసా పత్రా లు, జ్ఞాపికతో సన్మానించారు. పోటీల్లో గెలుపొందినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించి, ప్రశంసాపత్రం అందుకున్నా రు. ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ డా కె.వీరాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బా రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయితో పట్టుబడ్డ ఇద్దరి అరెస్ట్

కె.కోటపాడు : ఆనందపురం జంక్షన్‌లో మంగళవారం 4 కిలోల గంజాయితో ఇద్దరు యువకులను పట్టుకున్నట్లు ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. చేతిలో సంచులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న హైదరాబాద్‌కు చెందిన యువకులు వికాస్, రాకేష్‌లను తనిఖీ చేయగా, వారి సంచుల్లో గంజాయి ఉన్నట్టు తేలింది. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కొరియర్ బాయ్‌నంటూ నమ్మించి..

- మహిళ ఆభరణాలు అపహరించేందుకు యత్నం
- స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించిన వైనం

మునగపాక : తన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు అపహరించేందుకు వచ్చిన యువకునితో పావుగంటకు పైగా ఆమె పోరాడింది. బంగారాన్ని దోచుకునేందుకు అపరిచిత యువకుడు చేసిన ప్రయత్నాలను ఎదురొడ్డి నిలిచింది. కొరియర్ బాయ్‌గా ఇంటి వెనుక తలుపుల నుంచి ప్రవేశించి, ఒంటరిగా ఉన్న మహిళ మెడలో, చేతులకు ఉన్న ఆభరణాలను అపహరించేందుకు చేసిన ప్రయత్నాన్ని విఫలం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గణపర్తి గ్రామానికి చెందిన ఆడారి అచ్చియమ్మ తన భర్తతో కలిసి నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం అచ్చియమ్మ ఒంటరిగా ఉన్న సమయంలో యలమంచిలి మండలం పెదపల్లికి చెందిన బీటెక్ చదువుకున్న యువకుడు కొరియర్ బాయ్‌నంటూ వెనుక గేటు ద్వారా లోపలికి వచ్చాడు. వచ్చీ రాగానే అచ్చియమ్మ మెడలో ఉన్న తాళిబొట్టుతో పాటు చేతికి ఉన్న బంగారు గాజులను ఎత్తుకుపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆమె కంఠం నొక్కి, చెవులను నలిపేసి చోరీ చేసేందుకు చూశాడు. పావుగంట పాటు ఇద్దరి మధ్య పెనుగులాట చోటు చేసుకుంది. అచ్చియమ్మ కేకలు విని, పక్క ఇంటి నుంచి మహిళ రావడంతో యువకుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. స్థానికులు అతనిని చుట్టుముట్టి పట్టుకుని, మునగపాక పోలీసులకు అప్పగించారు.

డీఏ పెంపుపై సచివాలయ ఉద్యోగుల హర్షం


కిరణ్‌కుమార్

అల్లిపురం (విశాఖ దక్షిణ): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జనవరి 1, 2022 నుంచి ఇవ్వాల్సిన డీఏను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖపట్నం ప్రెసిడెంట్ పీజే గణేష్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించినందుకు సచివాలయ ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన


తారువలో విద్యార్థులకు పాలిటెక్నిక్ స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

- పాలిటెక్నిక్ స్టడీ మెటీరియల్ అందించిన డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు గత నెల 25 నుంచి పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ కోచింగ్ తరగతుల్ని నిర్వహిస్తున్నారు.

ఈ కోచింగ్‌కు హాజరవుతున్న 60 మంది విద్యార్థులకు పాలిటెక్నిక్ స్టడీ మెటీరియల్‌ను డిప్యూటీ సీఎం బూడి సమకూర్చారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని గ్రహించి, విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు కొరుపోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు భారీ భద్రత

1300 మందితో పటిష్టమైన బందోబస్తు


సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. సుమారు 1300 మందిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్ నెంబర్–4లో వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ నివాసానికి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ మంగళవారం సాయి ప్రియా రిసార్ట్స్‌లో బందోబస్తు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- సీఎం పర్యటన సందర్భంగా పోలీసు బందోబస్తును పలు కేటగిరిలుగా విభజించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కో విభాగానికి ఒక్కో పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.
- హెలీప్యాడ్, పార్కింగ్, కాన్వాయ్, ఐటీ హిల్స్, శిలా ఫలాకాల వద్ద, విశాఖ ఎంపీ నివాసం ప్రాంతంలోను, వీవీఐపీలకు బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.
- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు.
- హెలిపాడ్ వద్ద, వేదిక ప్రాంతంలో స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్లతో నిశితంగా తనిఖీలు చేపట్టారు.
- సీఎం పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే ఇతరుల వాహనాలకు వేరు వేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.
- నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ సీఎం పర్యటించే పర్యటించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

టీడీపీ హయాంలోనే నిధుల దుర్వినియోగం

- పూడిమడక ప్యాకేజీపై మాజీ సర్పంచ్ వెంకటరమణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చేపల వెంకటరమణ

అచ్యుతాపురం(అనకాపల్లి) : పూడిమడక మత్స్యకారులకు అందించాల్సిన ప్యాకేజీ విషయంలో కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, టీడీపీ హయాంలో ప్యాకేజీ సొమ్ము దుర్వినియోగమయిందని పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుతో నష్టపోతున్న మత్స్యకారుల్లో ప్యాకేజీలు పొందాల్సిన వారి సంఖ్య 4,828గా తేల్చారని, వీరికి సుమారు రూ.60 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసినట్టు తెలిపారు. ఇప్పటికే రూ.62 కోట్లు ప్యాకేజీ కోసం కేటాయించినా, 500 మందికి పైగా వాస్తవ లబ్ధిదారులకు ప్యాకేజీ అందలేదన్నారు. వారిలో 190 మందికి త్వరలోనే అందనున్నట్టు తెలిపారు. మిగిలిన 314 మందికి పరిహారం అందేలా ఎమ్మెల్యే కన్నబాబురాజు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్యాకేజీ సొమ్ము దుర్వినియోగం అయినట్లు స్వయంగా అధికారులే నివేదించారని వెల్లడించారు. తామెవర్నీ నిందించాలనుకోవట్లేదని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నానా హడావుడి చేసిన వారు వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. సమావేశంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడి


విద్యార్థులకు నియామకపత్రాలు అందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి


హాజరైన విద్యార్థులు

- ప్రతీ కష్టం వెనుక అవకాశాలు ఉంటాయి
- ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడిగా యువతరం అంకుర సంస్థలను స్థాపించాలని, దీనికి అవసరమైన పెట్టుబడి, మౌలిక వసతులు వర్సిటీ పరంగా అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థుల ఉద్యోగ విజయోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వృత్తిపరమైన సవాళ్లను అధిగమించడానికి, నిర్ధారిత లక్ష్యాలను ఛేదించడానికి మానసికంగా సిద్ధం కావాలన్నారు. ప్రతీ కష్టం వెనుక అవకాశాలు ఉంటాయనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. దేశానికి నూతన గతి శక్తిగా యువతరం నిలుస్తారన్నారు. విశ్వవిద్యాలయం ఆరంభం కేవలం ఆర్ట్స్ కోర్సులతోనే ప్రారంభం అయిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. మానవ సంబంధాలకు ఆర్ట్స్ కోర్సుల అభ్యసనం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. సమాజంతో మృగ్యమవుతున్న విలువలను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. నిత్యం తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ తల్లిదండ్రుల విలువ తెలుసుకుని మసలుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశానికి ఇన్నోవేషన్, ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎంతో అవసరమన్నారు. దీనికి అవసరమైన మౌలిక వసతులను వర్సిటీ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహా రావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ. ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్ రెడ్డి, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం 202 మంది విద్యార్థులకు 350కి పైగా ఉద్యోగ నియామక పత్రాలను వీసీ ప్రసాద రెడ్డి అందజేశారు. వేదికపై తల్లిదండ్రులను సత్కరించి, వారి పాదాలకు నమస్కరించిన అనంతరం విద్యార్థులు నియామక పత్రాలను స్వీకరించారు.

ప్లేస్‌మెంట్ టీం బాగా పనిచేసింది



ప్లేస్‌మెంట్స్‌ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఒక టీంని ఏర్పాటు చేశారు. వీరు ఎంతో సమర్థవంతంగా, సమన్వయంతో పనిచేశారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఫెడరల్ బ్యాంక్‌కు రూ 13.5 లక్షల వేతనంతో ఎంపిక అయ్యాను. మంచి వేతనాలతో ఎక్కువ మంది ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది.

–మురళీకృష్ణ, ఎంబీఏ విద్యార్థి

యూనివర్సిటీ ప్రగతి బాగుంది



మాది ప్రకాశం జిల్లా చీరాల. మా అబ్బాయిని ఎంబీఏలో ఎక్కడ చేర్పించాలనే అన్వేషణలో ఏయూ ప్రగతి బాగుందని తెలిసింది. ఇక్కడ చేర్పించాను. మా అబ్బాయి ఫెడరల్ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది. ఏయూపై మేము పెట్టుకున్న నమ్మకం మరింత పెరిగింది.

–రాంబాబు, చీరాల

వరాహనదిలో పడి మహిళ మృతి


నాగరత్నం మృతదేహం పరిశీలిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

కోటవురట్ల : ప్రమాదవశాత్తు నదిలో జారిపడి ఓ వికలాంగ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు పందూరు గ్రామానికి చెందిన అప్పికొండ నాగరత్నం(54) ఒంటరిగా జీవిస్తోంది. మంగళవారం ఉదయం బట్టలు ఉతికేందుకు గ్రామ శివారున ఉన్న వరాహనదికి వచ్చింది. బట్టలు జాడిస్తూ నదిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గం పక్కనే నాగరత్నం మృతి చెందడం దురదృష్టకరమని, ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతురాలు నాగరత్నం పక్షవాతంతో బాధపడుతోంది. మృతురాలి భర్త శేషగిరి ఓ కొడుకు పుట్టాక, పెళ్లయిన మూడేళ్లకే ఎక్కడికో వెళ్లిపోయాడు. కొడుకు చిరంజీవిని కష్టపడి పెంచి పెద్దచేసి వివాహం చేసింది. కోడలు అతన్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోవడంతో, మనస్తాపంతో తాగుడుకు బానిసై రెండేళ్ల క్రితం తునిలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి నాగరత్నం ఒంటరిగానే జీవిస్తోంది. ఇంతలో ఈ విషాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చంద్రబాబు ప్రోత్సాహంతోనే కాపులపై కేసులు

- తుని రైలు దగ్ధం కేసు కొట్టివేతపై సర్వత్రా హర్షం
- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం



నక్కపల్లి: చంద్రబాబు పాలనలో కాపులను అణగదొక్కే ప్రయత్నం జరిగిందని, తప్పుడు కేసులు పెట్టి హింసించారని రాష్ట్రట కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. అయితే చివరికి న్యాయమే గెలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ తుని రైలు దగ్ధం కేసులో కాపు నేతలు ముద్రగడ పద్మనాభం, దాడిశెట్టి రాజా తదితరులపై నమోదైన కేసులను రైల్వే కోర్టు కొట్టివేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో స్థానిక నాయకుల పాత్ర లేదన్నారు. కాపు ఉద్యమం సందర్భంగా అప్పటి టీడీపీ ప్రభుత్వం పెట్టిన ఇతర కేసులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు.

కాపులను బీసీలో చేర్చాలంటూ ఇంటి వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని చంద్రబాబు సర్కారు ఏవిధంగా హింసించిందో గమనించాలన్నారు. టీడీపీ గూండాలే ఈ ఉద్యమాన్ని పక్కదారి పట్టించి అరాచకం సృష్టించారని ఆరోపించారు. చివరకు న్యాయమే గెలిచిందన్నారు. ఇవన్నీ తప్పుడు కేసులన్న విషయం రుజువయిందన్నారు. ఇంత జరుగుతున్నా పవన కల్యాణ్ ఇంకా టీడీపీతో పొత్తుకు వెంపర్లాడటం తగదన్నారు.

ఇక స్క్రాప్ ఫ్రీ సిటీ!

- కణమాంలో రాజన్న ఆటోనగర్
- 157.77 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ సిటీగా విరాజిల్లుతున్న విశాఖ నగరం త్వరలో స్క్రాప్ ఫ్రీ సిటీగా మారబోతోంది. కాలుష్య తీవ్రతను తగ్గించే చర్యల్లో భాగంగా నగరంలోని స్క్రాప్ దుకాణాల(ఇనుప తుక్కు)ను నగర శివారు ప్రాంతాలకు తరలించాలన్న ప్రతిపాదన ఎన్నేళ్లగానో ఉంది. ఇందుకోసం ఎక్స్‌క్లూజివ్ ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత దుకాణ యజమానులు పదేళ్ల నుంచి కోరుతున్నారు. తొలుత గుర్రంపాలెం, కోడూరు తదితర ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్లాట్లు కేటాయిస్తామని, అక్కడకు తరలి వెళ్లాలని గత ప్రభుత్వ హయాంలో సూచించారు. అందుకు వీరు ససేమిరా అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో ఆనందపురం మండలం కణమాం సమీపంలో 157.77 ఎకరాల ప్రభుత్వ భూమిలో రాజన్న ఆటోనగర్ పేరిట ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అప్పట్లో కోవిడ్ ప్రభావం వల్ల ఆలస్యమైంది. ప్రతిపాదిత ఆటోనగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో సాగుదారులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. ఈ సొమ్ములో ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేసింది. మరో రూ.14 కోట్లు రావలసి ఉందని ఏపీఐఐసీ ఇన్‌చార్జి జోనల్ మేనేజర్ త్రినాథ్ 'సాక్షి'కి చెప్పారు.

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

తాజాగా కణమాం రాజన్న ఆటోనగర్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఆటోనగర్‌కు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆటోనగర్‌లో 250, 500, 1000 గజాల చొప్పున ఏపీఐఐసీ ప్లాట్లను కేటాయించాల్సి ఉంది. వీటిలో కొత్త వారికి కూడా ప్లాట్లను మంజూరు చేస్తారు. నగర పరిధిలోని తగరపువలస నుంచి గాజువాక వరకు జాతీయ రహదారికి ఆనుకుని అనేక స్క్రాప్ దుకాణాలున్నాయి. పెందుర్తి, ఎండాడ, ఇసుకతోట, టౌన్ కొత్తరోడ్డు, కోట వీధి, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోనూ ఇవి నడుస్తున్నాయి. రాజన్న ఆటోనగర్ అందుబాటులోకి వస్తే నగర పరిధిలో 1300కు పైగా స్క్రాప్ దుకాణాలు అక్కడకు షిఫ్ట్ అవుతాయి.

క్లుప్తంగా

జాతరలో నిబంధనలు పాటించాలి



పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్ : గ్రామ దేవత పండగలు నిర్వహించే సమయాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. గొలగాం గ్రామంలో శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరల సమయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఆలయానికి వచ్చే భక్తులకు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాయంత్రం సమయంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల సంప్రదాయ బద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిగిరెడ్డి నాగన ర్సింగరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'తిరుచానూరు ఆలయ సిబ్బందిపై చర్య తీసుకోవాలి'

అనకాపల్లిటౌన్ : రామానుజాచార్యులు జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా పండగలా చేస్తుంటే తిరుచానూరులో ఆలయ సిబ్బంది అడ్డుకోవడం హిందువుల మనోభావాలను దెబ్బతీయమేనని జిల్లా చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అధ్యక్షుడు అంతర్వేది బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నెల 30న తిరుపతి జిల్లా తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మాడవీధుల్లో తలపెట్టిన రామానుజ ఉత్సవాన్ని అడ్డుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం సిబ్బంది, విజిలెన్స్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వేసవిలో ఉపాధ్యాయులకు సెలవులు ప్రకటించాలి

అనకాపల్లిటౌన్ : వేసవిలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు అదనపు పనులు అప్పగించరాదని ఏపీటీఎఫ్ పట్టణశాఖ అధ్యక్షుడు కాండ్రేగుల దుర్గాప్రసాద్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అప్పగించినట్టయితే మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల వల్లే సంపాదిత సెలవులు ఆరు రోజుల నుంచి 24 రోజులకు పెంచాలన్నారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో విద్యార్థులకు సెలవులు ప్రకటించడం జరుగుతుందని, విద్యార్థుల మాదిరిగా ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,264 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,460	4,460
మొదటి రకం	4,060	4,470
రెండో రకం	3,700	3,110
మూడో రకం	3,200	3,710

అనకాపల్లి సినిమాలు

సిసు	రాజా
ఏజెంట్	సత్యనారాయణ స్క్రీన్-1
కలియుగ భగవాన్ (ఉదయం ఆట)	
రారా పెనిమిటి (3ఆటలు)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్లిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-30 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.


గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 433 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

చకచకా జగనన్న ఇళ్ల నిర్మాణాలు



హంగులతో నిర్మించిన జగనన్న లేఅవుట్‌లో నూతన గృహం



శంకరం జగనన్న ఇళ్లతో కొత్త ఊరు

- శరవేగంగా మౌలిక వసతులు
- పేదల సొంతింటి కల సాకారం

తుమ్మపాల : పేదవాడి సొంతింటి కలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది నవరత్నాల్లో భాగమైన వైఎస్సార్ జగనన్న–పేదలందరికి ఇండ్లు పథకం. పేద, మధ్యతరగతి, ధనిక ప్రతి ఒక్కరికి సొంతింటిని నిర్మించుకోవాలని కళ ఉంటుంది. ధనిక, మధ్యతరగతి వర్గాల ప్రజలు ఏదోవిధంగా గృహాన్ని నిర్మించుకుంటున్నారు. కాని పేదవాడికి మాత్రం తన సొంతింటి కల, కలగానే మిగిలిపోతుంది. ప్రస్తుత పోటీప్రపంచంలో పేదవాడు పేదవాడిగానే మిగిలిపోతున్నాడు. తన కుటుంబాన్ని పోషించుకునేందుకు మూడు పూటల తిండి కూడా కష్టతరంగా మారి పూటకోసం పట్టణాల బాట పడుతున్నారు. వలస జీవులుగా జీవనం సాగిస్తు తనకంటు నిలువు నీడ లేకుండానే తనవు సాగిస్తున్నారు. పేదవాడి పాలిట పెన్నిధిలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకానికి శ్రీకారం చుట్టి సొంత గూడుతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందిస్తు వారి కల్లల్లో ఆనందాన్ని నింపుతున్నారు. ప్రతి పేదవాడు సొంతింటిని నిర్మించుకోవాలి, సమాజంలో ప్రతి పేదవాడికి గుర్తింపు ఉండాలనే కృతనిష్చయంతో జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటుచేసి నూతన గ్రామాలు (ఊర్ల)నే నిర్మిస్తున్నారు.

ఊపందుకున్న నిర్మాణాలు

మండలంలో 31 గ్రామ పంచాయతీలకు గాను 48 జగనన్న లేఅవుట్‌లను ఏర్పాటుచేసింది ప్రభుత్వం. ప్రభుత్వ స్థలాలు లేని కొన్ని చోట్ల ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదల కోసం లేఅవుట్‌లు నిర్మిస్తున్నారు. మండలంలో మొత్తం 3,389 గృహాలు మంజూరు జరిగింది. కరోనా, ఇటీవల వర్షాల కారణంగా మందకుడిగా సాగిన ఇళ్ల నిర్మాణం ఇప్పుడుప్పుడే వేగంగా సాగుతుంది. దాదాపు 3వేల ఇండ్ల వరకు పునాదులు పూర్తయ్యాయి. ఒక వెయ్యి గృహాల స్లాబులు పూర్తవ్వగా, ఇప్పటికే ఐదు వందల వరకు గృహాల్లో లబ్ధిదారులు ప్రవేశించి నివాసముంటున్నారు. రానున్న రెండు మూడు నెలల్లో గృహాలను ప్రారంభించేందుకు లబ్ధిదారులు సిద్ధపడుతున్నారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి.

విద్యుత్ సదుపాయం ఏర్పాటు

వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లకు రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ వగైరా మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఆయా శాఖల అధికారులు క్రమపద్ధతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గృహనిర్మాణాల పనుల కోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లో లేఅవుట్‌ల వద్ద బోర్లు వేశారు. నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రతి ఇంటి వద్ద కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు. దాదాపు 25 గ్రామాల్లో విద్యుత్ వ్యవస్థను పూర్తి చేశారు. అధికార యంత్రాంగం రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

సకాలంలో లబ్ధిదారులకు చెల్లింపులు

జగనన్న కాలనీల్లో రానున్న రెండు మూడు నెలల్లో గృహాలు పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నాం. నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు వేగంగా పేమెంట్ చెల్లిస్తున్నాం. గృహానికి అవసరమయ్యే ఇనుము, సిమెంట్, ఇసుకతో పాటు డోర్‌లు, కిటికీలు వంటి వుడ్ వర్కు సామాగ్రి కూడా ప్రభుత్వం అందిస్తుంది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలతో పాటు అదనంగా డ్వాక్రా మహిళకు రూ.30 వేలు ప్రభుత్వం అందిస్తుంది

–టి.యుగంధర్, ఏఈ, గృహనిర్మాణ శాఖ, అనకాపల్లి మండలం

సొంతింటి కల నేరవేరింది

మాకు సొంతిల్లు లేదు. అద్దె ఇండ్లలో నివాసముంటూ కూలీపనులు చేసుకుంటు జీవిస్తున్నాం. ధరల భారంతో సొంతింటి కల కలగానే ఉండిపోతుందనుకున్నాం. కాని జగనన్న ముఖ్యమంత్రి కావడంతో మాకు ఉచితంగా స్థలం ఇచ్చారు. సొంతంగా ఇంటిని నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు ఇస్తున్నారు.

–కరణం అచ్చియ్యమ్మ, రేబాక

చిత్తశుద్ధితో సంక్షేమ, అభివృద్ధి పథకాలు



జమాదులపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. జమాదులపాలెం గ్రామంలో మంగళవారం ×గడప గడపకు మన ప్రభుత్వం× కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అడుగడుగునా మంత్రికి మంగళ హారతులు పట్టి, దుశ్శాలువాలు కప్పి, పూలదండలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కర పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు నవ రత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే మరిన్ని పథకాలను అమలు చేస్తారన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. జమాదులపాలెంలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.15 లక్షలు తక్షణం మంజూరు చేస్తున్నట్లు స్థానికుల అభ్యర్థన మేరకు ప్రకటించారు. సామాజిక భవనం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఆర్వో ప్లాంటు, డిజిటల్ లైబ్రేరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారుల గైర్హాజరుపై మంత్రి ఆగ్రహం:

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కొందరు అధికారులు, సిబ్బంది గైర్హారు కావడంపై మంత్రి అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ గైర్హాజరు కావడం, కొన్ని శాఖల సిబ్బంది ఆలస్యంగా హాజరు కావడంతో వారికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం పట్ల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించి అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు.

ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గున్నయ్యనాయుడు, రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ గూడెపు లక్ష్మి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఎంపీడీవో అప్పారావు, పార్టీ నాయకులు గంగునాయుడు, సానబోయిన శ్రీను, రాజారావు, ఒమ్మి రాము పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛను అందజేత



డయాలసిస్ రోగికి ఫించన్ అందజేస్తున్న కొణతాల భాస్కర్

అనకాపల్లి టౌన్ : వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతూ వైద్యుని సర్టిఫికెట్ పొందిన రోగులకు ప్రభుత్వం పింఛను అందజేస్తుందని వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కర్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన ఎరుకువానిపాలెం గ్రామంలో డయాలసిస్ వ్యాధితో బాధపడుతున్న మేడిశెట్టి సూర్యకాంతంకు మంగళవారం పింఛను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. డయాలసిస్ రోగులకు కావలసిన వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి

అనకాపల్లిటౌన్: శారదానది ఒడ్డున గల అన్నమయ్య పార్కు, శాంతి పార్కులను అభివృద్ధి చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు అన్నారు. స్థానిక శారదానది ఒడ్డున అన్నమయ్య పార్కును మంగళవారం పార్టీ నేతలు సందర్శించారు. గతంలో శారదానది ఒడ్డున శాంతి, అన్నమయ్య పార్కులు ప్రశాంతమైన వాతావరణంలో పచ్చని మొక్కలతో ఆహ్లాదంగా ఉండేవని, వేసవిలో వృద్ధులు, పిల్లలు ఇక్కడకు వచ్చి సేదతీరేవారని అన్నారు. శారదానదిపై నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో అన్నమయ్య పార్కు శిథిలావస్థకు చేరిందన్నారు. పార్కు చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. పట్టణ పరిధిలోని రెండు పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. ఆప్ నేతలు సీహెచ్ శ్రీనివాసరావు, రమణ, బాబ్జి, నారాయణరావు, అప్పారావు పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో ఘనంగా పైడితల్లమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ఎడ్లబళ్ల పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: కన్నూరుపాలెం గ్రామంలో పైడితల్లమ్మ పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొని ఎడ్ల బళ్ల పరుగు పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు సర్పంచ్‌లు గున్నయ్యనాయుడు, శివ, చిరికి సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన

కశింకోట : కశింకోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలిపారు. ఆశ కార్యకర్తలకు అదనపు బాధ్యతలు అప్పగించరాదని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఇతర సదుపాయాలు అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ మేరకు వైద్యాధికారి తిరుమలరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధి భార్గవి కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ల ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయసేకరణలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : మండలంలో మామిడిపాలెం, మార్టూరులో గ్రామాల్లో మూడుస్టోన్‌క్రషర్ ఏర్పాటుపై మంగళవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు డీఆర్వో పి.వెంకటరమణ, పొల్యూషన్ బోర్డు ఈఈ వెంకటేశ్వర్లు, మైనింగ్ ఏడీ రవివర్మ హాజరయ్యారు. మామిడిపాలెం గ్రామంలో సర్వే నంబర్ 109లో 0.49 హెక్టార్లలో, అదే సర్వే నంబర్‌లో ఒక హెక్టార్‌లో రోడ్‌మెటల్, పూడి పరదేశినాయుడు, సీఎల్.మోహనరావు బిల్డింగ్‌స్టోన్స్ నిమిత్తం 2 స్టోన్ క్రషర్లు ఏర్పాటుపై జరిగిన సభలో గ్రామస్తుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. మార్టూరు గ్రామంలో సర్వే నంబర్ 1లో 3 హెక్టార్లలో టి.విజయ కుమారి రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్స్ నిమిత్తం జరిగిన సభలో గ్రామస్తు డిమాండ్లను సభకు తెలియజేశారు. ఆయా డిమాండ్లు యాజమాన్యాలు అంగీకరించడంతో ప్రజాభిప్రాయసేకరణ ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఆర్ఐ రమేష్ పాల్గొన్నారు.

10,11 తేదీల్లో ఆలయ భూముల కౌలుకు వేలంపాట

మునగపాక : మండలంలోని పాటిపల్లి, రామగిరి ఆలయాలకు సంబంధించిన దేవదాయ భూములకు ఈ నెల 10,11 తేదీల్లో కౌలుకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఈవో పీఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

పాటిపల్లి శ్రీ ఆహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన 7.32 సెంట్ల భూమికి ఈ నెల 10న అలాగే రామగిరి శ్రీ కోదండ సీతారామ ఆలయానికి చెందిన 10.15 సెంట్ల భూమికి ఈ నెల 11వ తేదీన వేలం నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

ఎస్.రాయవరం : వైద్య సిబ్బంది సకాలంలో పీహెచ్‌సీకి వచ్చి సేవలందించకుంటే సహించేది లేదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కె.వీరజ్యోతి అన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎవరెక్కడ ఉన్నారనే దానిపై ఆరా తీశారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఆశా డే కావడంతో ఆశా కార్యకర్తలతో మాట్లాడారు గ్రామాల్లో వారు అందిస్తున్న సేవలపై ప్రశ్నించారు. ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, ప్రభుత్వ లక్ష్యాలను చేరువయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వాసంతి, ఆశా నోడల్ అధికారి ఎం.రత్నం, ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అందుబాటులో చిరుధాన్యాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో చిరుధాన్యాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు మంగళవారం తెలిపారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలు భుజించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

చిరుధాన్యాల వంటకాలపై స్థానిక పరిశోధనాస్థానంలో తుమ్మపాల ఎస్‌వీడీఎస్ వారి సహకారంలో మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.

కలెక్టర్ ఆదేశంతో చెత్త సమస్య పరిష్కారం



డంపింగ్ యార్డులో చెత్తను చదును చేయిస్తున్న డీపీవో శిరీషారాణి,అధికారులు



పొక్లెయిన్‌తో చెత్తను చదును చేస్తున్న సిబ్బంది

- డంపింగ్ యార్డు వద్ద చదును పనులు
- పర్యవేక్షించిన డీపీవో శిరీషారాణి

అనకాపల్లి రూరల్ : జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశంతో మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్యకు గంటల వ్యవధిలోనే పరిష్కారం లభించింది. మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల పండ్ల తోటలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల పనితీరు పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పర్యటించారు. దీనిలో భాగంగా తుమ్మపాల సంతబయలు సమీపంలో ఉన్న అగ్రి అండ్ హార్టీ రైతు ఉత్పత్తి సంఘాన్ని పరిశీలించారు. ఆ సమయంలో స్థానికులు కొండలా పేరుకుపోయిన డంపింగ్ యార్డులో చెత్తను చూపి దాని కారణంగా వారెదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేసారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డంపింగ్ యార్డులో చెత్తకు ఫోటోలు తీసి జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణికి పంపించారు. వెంటనే స్పందించిన డీపీవో శిరీషారాణి తుమ్మపాల చేరుకుని అప్పటికప్పుడు అనకాపల్లి నుంచి పొక్లెయిన్ రప్పించి డంపింగ్ యార్డులో చెత్తను చదును చేయించారు. ఎంపీడీవో కె.ధర్మారావు, తుమ్మపాల పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాస్, సిబ్బంది డీపీవోకు సహాయ సహకారాలు అందజేశారు. 40 ఏళ్లుగా కొండలా పేరుకుపోయిన చెత్త సమస్య కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చొరవతో గంటల వ్యవధిలోనే పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై అవగాహన



కె.వెంకటాపురం ఆర్బీకే వద్ద జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, అధికారులు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ముఖ్య ఉద్దేశ్యం, దరఖాస్తు విధానం వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా సమస్త వ్యవసాయ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక



అంబేద్కర్ పార్కులో సమావేశమైన ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాయకరావుపేట : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కార్యవర్గం ఎన్నిక పట్టణంలో గల అంబేద్కర్ పార్కు నందు మంగళవారం జరిగినట్లు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పి కోస్తా ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్ ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ తెలిపారు. ఎంఆర్‌పీఎస్ అనకాపల్లి జిల్లా కన్వీనర్‌గా పెందుర్తికి చెందిన ఎంఆర్‌పీఎస్ నాయకుడు గొట్టివాడ సామ్రాట్‌ను, పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలో ఈదటం గ్రామానికి చెందిన గంపల రాంబాబును, మండల అధ్యక్షుడుగా తుమ్మలపల్లి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కడితి సాదురావు, కొల్లి చిన అప్పారావు, ఎలకమల్లి బాబు, గంపల చినరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, గంటేడ జాను, దూలపల్లి రామకృష్ణ, చంటి బాబు, పాల్గొన్నారు.

10 నుంచి ఇంటింటా ధర్మ ప్రచారం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఈ నెల 10 నుంచి ఇంటింటా ధర్మ ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు కె.రాజు, బి.వి రమణ తెలిపారు. అచ్యుతాపురంలోని శ్రీ కృష్ణ, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో మంగళవారం మండల స్థాయి సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశంలో జరిగింది. ప్రతి నెలా దేవాలయాల్లో సామూహిక హారతి నిర్వహించాలని, ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, అప్పలనాయుడు, లాలం నాని, కిలాడి రమణ పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ అమ్మవారి జాతర



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ యర్రవరం గ్రామంలో మంగళవారం పరదేశమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు పరదేశమ్మ తల్లి దర్శనానికి తరలివచ్చి పసుపు, కుంకుమ చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని బంతి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా, విద్యుదలంకరణలు ఏర్పాటు చేశారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి పండగ

మునగపాక : మండలంలోని ఒంపోలు గ్రామంలో మంగళవారం పైడిమాంబ అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వేసవి కాలం కావడంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ తగు చర్యలు తీసుకుంది. అలాగే గ్రామంలో నేల వేషాలు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.